

# అనుబంధం



**కె. ఆర్. కె. మోహన్**

దీపావళి కథలపోటీలో

## రెండవ బహుమతి పొందిన కథ

వేసవికాలం ఎండ జోరుగా బుర్ర మాడుస్తోంది. వీధుల్లో ఎక్కడా కుక్కలూ, పందులూ వంటి నిత్యమూ రోడ్లమీద దర్శనము ఇచ్చే జంతువులు కూడా ఆ రోజు కనిపించడములేదు. అవన్నీ దొరికినచోట నీడ చూసుకుని చెవులు మూసుకొని పడుకున్నాయి. రోడ్డు ప్రక్క సందులలో తూముల పరిమాణం చాలక సందులలోకి నెట్టుకు వచ్చిన మురికినీరు ధర్మమా అంటూ ఏర్పడ్డ గొబ్బులో పందులు తమ బంధుమిత్ర పరివారంగా పడుకుని అదే స్వర్గమేమో అన్నంత ఆనందాన్ని అనుభవిస్తున్నాయి. చెట్ల మీద కాకుల నోరు తెరుచుకుని చూస్తూ అప్పుడప్పుడు "కావు .... కావు" మని అరవబోయి, అరవలేక సగంలో ఆపేస్తున్నాయి. రోడ్లమీద జనసంచారం చాలా తక్కువగా ఉంది.

ఆ మండుటెండలో కాకీ—యూనిఫారంలో చెవులకు గుడ్డ కట్టుకుని, చేతిలో నిండు చూలాలు వంటి ఉత్తరాల కట్టను పెట్టుకుని, భుజాన్న సిమెంటుబస్తా అంతటి కాకీసంచిని వ్రేలాడేసుకుని వడివడిగా నడుస్తున్నాడు పోస్టుమేన్ రాజు. గత అయిదు సంవత్సరాలుగా అతనికి ఆ నికృష్ట జీవితం అలవాటయిన దయినా ఆరోజు ఎండకు అతను కూడా తట్టుకోలేక పోతున్నాడు. ఇంకొక్క ఫర్లాంగు దూరం నడుస్తే సుబ్బమ్మగారి ఇల్లు వస్తుంది. ఆ వీధి చివర ఉన్న సందు మొగలోనే ఉంది ఆవిడ ఇల్లు. అక్కడ ఆవిడ చేతిమీదుగా కొంచెం మజ్జిగతేట త్రాగి కాస్తంత విశ్రాంతి తీసుకోవచ్చు. ఈ ఫర్లాంగు దూరంలో ఇయ్యవలసిన ఉత్తరాలు కూడా ఆట్టే లేవు. అందుచేత వడివడిగా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు రాజు. త్వరలోనే ఇల్లు చేరాడు. ఆమె ఇచ్చిన మజ్జిగ త్రాగి అరుగుమీద చతికిలబడ్డాడు. ఎండ అప్పుడే బయటకు కదలనిచ్చేట్టు లేదు. సుబ్బమ్మగారు ఏవో పిచ్చాపాటీ కబురు చెబుతూ, ఎండ

—౮౩ వ పేజీ చూడండి

# అనుబంధం

**13 వ పేజీతరువాయి**

పేడిమికి గోడ ఆనుకుని కునికిపాట్లు పడుతోంది. ఆమెను చూస్తూంటే రాజా మదిలో అనేకమయిన గత స్మృతులు మెదిలాయి. ఆమెకు ఏభై ఏళ్ళు పైబడ్డాయి. కాని డెబ్బదిఏళ్ల మనిషి అన్నట్లుగా కృశించిపోయింది. ఆమె శరీరంలో ప్రతి ముడత వెనకా అనేక బాధల మడతలు దాగి ఉన్నాయి. ఆమె హృదయం వెన్న వంటిది. ఆమెకీ తనకీ మధ్య ఉన్న అనుబంధం తలుచుకుంటే విచిత్రంగా ఉంటుంది. ఆమె ఎవరు! తాను ఎవరు? ఇద్దరికీ ఏమిటీ సంబంధం? ఆమె ఎందుకు ప్రతి రోజూ తన రాకకోసం ఎదురుచూస్తూ ఉంటుంది? ఎందుకు తనకు కూడా ఆమెతో మాట్లాడితే అంత తృప్తి! ఇది ఏ జన్మాంతర సంబంధమో! రాజా మెదడులో ఆమె దీన చరిత్ర ఒక్కసారి గిర్రున తిరిగింది.

## 2

సుబ్బమ్మగారు బ్రతికిచెడ్డ వ్యక్తి. ఆమె భర్త ఉండగా వాళ్ళు కొంచెం ఆస్తిపరులే. ఓ రెండెకరాల భూమి, ఆ చిన్న పెంకుటిల్లూ మాత్రమే వారి స్థిరాస్తి. చరాస్తి అసలు లేకపోలేదు కాని ఉన్నది మటుకు ప్రత్యేకించి చెప్పుకోదగ్గది కాదు. భర్త ఆనందరావుగారు షావుకారి కొట్లో గుమాస్తాగా ఉండేవారు. పొలంమీద వచ్చే రాబడితో పొట్ట నింపుకుని, భర్త సంపాదనతో పై ఖర్చులు చూసుకుని, మొత్తంమీద గుట్టుగా సంసారం నడుపుకు వస్తుండేది సుబ్బమ్మగారు. భర్త ఎప్పుడో ప్రొద్దుననగా ఉద్యోగానికి పోయి, మళ్లీ రాత్రి ప్రొద్దుపోయి తిరిగి వచ్చేవాడు. మధ్యలో మధ్యాహ్నం ఒకసారి వచ్చి మూతికి రెండు మెతుకులు రాసుకుని మళ్లీ వెళ్లిపోయేవాడు. ఈలోగా సుబ్బమ్మగారు ఇంటిపనులు చేసుకుని, తీరిక చూసుకుని చుట్టుప్రక్కల ఇండ్లకు వెళ్లి, భారత, భాగవత రామాయణాదులు చదివి అందరికీ అర్థం అయ్యేటట్లు చెప్పేది. ఎవరికి ఏ అవసరం వచ్చినా సాధ్యమయినంతవరకూ అడక్కుండానే సహాయం చేసేది. ఆవిధంగా ఆ వాడకట్టులో అందరికీ తలలో నాలుకలాగా ఉండి "మహాతల్లి సుబ్బమ్మగారు" అని అనిపించుకుంది.

అప్పటికి సుబ్బమ్మగారికి పాతిక సంవత్సరాలుంటాయి. ఆమెకు 18 వ ఏటనే వివాహం అయింది. ఈలోగా ఆమె మూడుసార్లు గర్భం దాల్చి శిశువులను కనడం, వాళ్ళు రోజులూ, నెలలలోనే వాళ్ల రోజులు పూర్తి చేసుకుని పోవడం జరిగింది. ఈ కడుపు శోకం భరించలేకపోయారు ఆ దంపతులు. పిల్లలు లేకపోయినా పరవాలేదు కాని ఈవిధంగా పుట్టి గిట్టడమనేది వారికి దుస్సహమనిపించింది. అందరికీ మంచి చేసే సుబ్బమ్మగారికి భగవంతుడు ఎందుకు అన్యాయం చేస్తున్నాడా అని ఆ వాడకట్టంతా బాధపడేది. ఆ విచారాన్ని మరచిపోవడానికే సుబ్బమ్మగారు ఎక్కువకాలం పురాణపఠనంలో గడిపేది.

సుబ్బమ్మగారు తిరిగి గర్భం దాల్చింది. గర్భం దాల్చినందుకు సంతోషంగా ఉన్నా ఇదైనా దక్కుతుందో దక్కదో అనే నిత్యశంకతో బాధపడుతూ ఉండేవారు ఆ దంపతులు. రోజులు గడుస్తున్న కొద్దీ, పురిటిరోజులు దగ్గర పడుతూన్న కొద్దీ ఆ దంపతుల ఆరాటం హెచ్చసాగింది. ఎన్ని దేవుళ్లకు మొక్కుకుంటున్నారో అంతేలేదు.

మళ్లీ వసంతకాలం వచ్చింది. చెట్లన్నీ క్రొత్త చిగుళ్లతో రంగు రంగుల వేషాలు వేసుకుని, గండుకోయిలలకు కడుపారా తిండి పెడుతూ, వాటిచేత గానకచేరీలు చేస్తున్నాయి. అమావాస్య చీకట్లు పోయి శుక్లపక్ష చంద్రుడు దినదిన ప్రవర్థమానమవుతున్నాడు. చివరకు ఆరోజు రానే వచ్చింది. సుబ్బమ్మగారు సునాయాసంగా మగ శిశువును కన్నది. ఆ దంపతుల ఆనందానికి అవధే లేదు. పిల్లవాడు బాగా ఆరోగ్యంగానే పుట్టాడు. ఆ దంపతులు వాడేమీ క్రొత్త విచారాన్ని తీసుకురాడనే భావించారు. వారు అనుకున్నట్లు ఆ బాలుడు దిన దిన ప్రవర్థమానమవుతున్నాడు. అపురూపంగా పుట్టిన ఆ పిల్లవానికి దంపతులు ముప్పదిమూడు కోట్ల దేవతలలో ముఖ్యమైన పేర్లు అన్నీ కలిపి పేరుపెట్టి, చివరని పిలవడానికి మాత్రం, వారి ఆరాధ్య దైవమయిన "రఘు" నామం ఉంచారు. ఆ శిశువుతో ఆ దంపతులు రోజు నొక క్షణంగా గడుపుతున్నారు.

రఘూ ఏడాది పిల్లవాడు అయ్యాడు. ఆరోజు రఘూ పుట్టినరోజు. ఆనందరావు ఆరోజు సెలవు పెట్టి బజారునుండి అనేకమయిన బొమ్మలూ, ఆటవస్తువులూ తెస్తున్నాడు. అవన్నీ సంచీలో వేసుకుని రిక్షాకోసం చూస్తున్నాడు. ఆ మధ్యాహ్నం కూడా ఎండ బాగా ఉంది. ఒక్క రిక్షా కూడా రావడంలేదు. ఆయన ఉత్సాహం ఆపుకోలేకపోయారు. ఎప్పుడు ఇంట్లోకి వచ్చి వాలుదామా, ఎప్పుడు రఘూని ఎత్తుకుని ముద్దాడుదామా అని తత్తరపడిపోతున్నా'రాయన. ఆ సామానులు తీసుకుని హడావుడిగా ముందూ వెనకా చూడకుండా వస్తున్నాడు. రోడ్డుమీద జనసంచారం తక్కువగా ఉందేమో. లారీ ఒకటి మంచి వేగాన్న వస్తోంది. అది రావట మేమిటి, వెనకాల నుంచి ఆనందరావును గ్రుద్దట మేమిటి, రెప్పపాటు కాలంలో జరిగిపోయాయి. సందువైపుకు వెళ్లడానికి రోడ్డు దాటుతున్న ఆనందరావుగారి చేతి సంచీ ఎగిరి అంత దూరాన పడింది. అంతే .... ఆనందరావుగారి బదులు ఒక నెత్తురుమడుగూ, అందులో ఉండల్లే ఆయన శరీరం, వాటిని వెక్కిరిస్తున్నట్లు దూరాన పగిలిపోయిన బొమ్మలూ మిగిలాయి. అంతే .... సుబ్బమ్మగారి నుదుటి కుంకుమ రాలిపోయింది. ఎంతో సంతోషంతో గడపవలసిన ఆరోజు అలా శాశ్వత విచారాన్నిచ్చి ముగిసింది.

## 3

సుబ్బమ్మగారికి వరుసగా కలిగిన దుఃఖాల మూలంగా ఆమె హృదయం మోడువారిపోయింది. ఆ మోడుపై ఎక్కడన్నా, ఎప్పుడన్నా కొంచెం చిగురు కన్పించేది "రఘు" మాత్రమే. అపురూపంగా పుట్టి, పుట్టిన ఏడాదికే తండ్రిని దిగమ్రింగిన ఆ నిర్భాగ్యుని సాకడానికి ఆమె ద్విగుణీకృత బాధ్యత స్వీకరించింది. రఘుని ఆమె అల్లారుముద్దుగా పెంచింది. వాడిమీద ఈగను కూడా వాలనిచ్చేదికాదు. ఉన్న ఆ కాస్త ఆస్తినే జాగ్రత్తగా నిర్వహించుకుంటూ వాడికి ఏ లోటూ రానీకుండా మహారాజు బిడ్డలా చూసుకొంటోంది ఆమె. రఘు స్వతహాగా చురుకైన పిల్లవాడు. అందమైనవాడు. వాడి ఆటపాటలు అందరికీ ముద్దు కల్పించేవి. అందులో సుబ్బమ్మగారిమీద ఉండే గౌరవాభిమానాలవల్ల ఆ వాడలో ఉన్నవాళ్లందరూ ఆ పిల్లవాడిని అతి గారాబంగా చూసేవారు. ఆవిధంగా రఘు అమిత గారాబంతో ఏడు సంవత్సరముల వరకూ పెరిగాడు.

ఏడవ సంవత్సరంలో రఘూని బళ్లో చేర్పించారు. నిత్యమూ అమిత గారాబంలో పెరిగిన రఘుకి ఈ బడి వాతావరణం ఏమీ నచ్చలేదు. మేస్టరుగారు అక్షరాలు దిద్దమనడం, ఏమిటేమిటో అనమనడం, వినమనడం, ఇవన్నీ తలనొప్పి పుట్టించేవి. కాని రఘూకి బడికి రావడానికి ఒకవిధంగా ఉత్సాహంగా ఉండేది. ఎందుకంటే రఘు తెచ్చే తాయిలాలకోసం అనేకమంది కుర్రవాళ్ళు వాడి చుట్టూ చేరేవాళ్ళు. వాళ్లందరికీ రఘు నాయకుడు. పంతులుగారు ఉన్నంతసేపూ ఏదోవిధంగా ప్రాణాలు బిగపట్టుకుని కూర్చునేవారు. బడి వదిలిపెట్టగానే "హాయ్" అని అరుచుకుంటూ

### ప్రసాదించు!

క్రను కొలుకుల వార
దాగు నిత్యతిమిరాల
దోచు దీపాలు వెలిగించు
భగవాన్! కాంతిప్రసరించు.

ఎదఎదనుతాకు మెత్తని
చీకట్లు చీల్చనురక్తి
కిరణాలు ప్రసరించు
భగవాన్! ఆశప్రసాదించు.

మాలోని నరకుణ్ణి
చెండాడ చైతన్యబాణాలు వెయ్యి
భగవాన్! సత్యభామ నిలదించు
దీపావళి ప్రసాదించు!

మరోసారి అవతారమెత్తు
భగవాన్! మరొకసారి
అవతారమెత్తు
దీపావళి ప్రసాదించు!

—వీరాజీ.

## ఇంటింటి విజ్ఞాన సాహిత్య సదనం

## EVERY HOME LIBRARY PLAN

దేశీ, విదేశీ సాహిత్యంలోని ప్రసిద్ధ గ్రంథాలను (నవల, నాటకం, కథ, విజ్ఞానం, చరిత్ర, జీవిత చరిత్ర, మిస్టరీ, డిటెక్టివ్ మొదలుగాగల సాహిత్య రంగాలన్నిటా)

**చౌకలో దేశీ, విదేశీ సాహిత్యం** ప్రఖ్యాతాంధ్ర రచయితల మౌలిక రచనలను, ఒకే సైజున ముద్రించి, ముచ్చటయిన ముఖచిత్రంతో అందంగా చౌకలో (షుమారు 100 పేజీలు రూపాయి వెల వుంటుంది.) పాఠకులకు అందచేస్తాం.

**ఇ. వి. సా. సదనం సభ్యత్వం** పాఠకుల సౌకర్యంకోసం దీనికి సభ్యత్వపు పద్ధతి కూడా ఏర్పాటుచేశాం. 10 రూపాయలు చెల్లించి దీనిలో ఎవరైనా సభ్యులుగా చేరవచ్చు. సభ్యులకు ప్రణాళికతరపున వెలువడిన 120 రూ॥ విలువగల పుస్తకాలు 100 రూ॥ లకే ఇస్తాం. సంవత్సరంలో ప్రతి 40 రోజులకు ఒకసారి 12 రూ॥ విలువగల ప్రణాళిక తరపున వెలువడు ప్రచురణలు 10 రూ. చొప్పున వి. పి. గా (డబ్బు చెల్లించి తీసుకునేపద్ధతి) తొమ్మిది దఫాలు, పదవ దఫా రిజిష్టర్డు పోస్టులోనూ (డబ్బు చెల్లించ నవసరంలేదు.) పోస్టు ఖర్చులు భరించి పంపుతాం. సభ్యులకు ప్రణాళికా ప్రచురణలేగాక - ఇతరుల ప్రచురణలుకూడా (మా కేటలాగులోనివి) 20% తగ్గించి, పోస్టు ఖర్చులు భరించి పంపుతాం.

**సభ్యులకు పలువిధాల లాభాలు** ఇ. వి. సా. సదనంలో సభ్యులుగా చేరితే —

(1) దేశీ విదేశీ సాహిత్యంలోని ఉత్తమ గ్రంథాలు మీ యింట వుంటాయి. (2) 120 రూ. గ్రంథాలు 100 రూ. లకే లభిస్తాయి. (3) పుస్తకాలు పంపటానికి రవాణా సౌకర్యం ఉచితం. (4) ప్రణాళిక తరపున వెలువడు 'హంస' పత్రిక ఉచితంగా లభిస్తుంది. (5) మొదటి సంవత్సరం సభ్యత్వం ముగించి, రెండవ సంవత్సరం సభ్యత్వం నగదది అయిన తర్వాత 200 పుస్తకాలు పెట్టుకోడానికి సరిపడు చక్కటి షెల్ఫు ఒకటి యిస్తాం.

**మూడు నగదు బహుమతులు** సభ్యుల సంఖ్య 1000 లకు మించిన తర్వాత సంవత్సరాని కొకసారి సభ్యులలో ఒక లాటరీని నిర్వహించుతాం. దానికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ 299. రు.199, రు. 99 నగదుగా యిస్తాం.

**ఉచిత సభ్యత్వం** 20 మంది సభ్యులను చేర్పించినవారికి ఉచిత సభ్యత్వం లభిస్తుంది. మామూలు సభ్యులకు లభించే సౌకర్యాలు, లాభాలు అన్నీ ఈ ఉచిత సభ్యులకుకూడా లభిస్తాయి.

**మొదటి విడుదల పుస్తకాలు** (1) కరుణ - నవల, (2) నటీపూజ - నాటకం, (రవీంద్రనాథ ఠాకూర్) (3) ఉపాసిని - నవల, (శ్రీమతి వి. విజయలక్ష్మి) (4) కెరటాలు-నవల(అపూర్ణ) (5)న్యాయవిచారణ-నవల (ప్రేమేంద్ర మైత్ర) (6) పతనం - నవల (గోర్కీ) సభ్యులకు ప్రతి పుస్తకం రెండు రూపాయలు -

వివరాలకు:

దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, శరత్ బిల్డింగ్స్,
అరండల్ పేట : : విజయవాడ - 2

SWASTIK


# అనుబంధం

పరిగెత్తుకుంటూ వెళ్ళి దగ్గర్లో ఉన్న పాడుబడ్డ శివాలయంలో చేరేవారు. అక్కడ వాళ్ళకి ఆడుకోడానికి కావలసినంత సావకాశం ఉండేది. అవిధంగా పెరుగుతున్న రఘుకి రోజురోజుకూ ఆటలంటే శ్రద్ధ, పాఠాలంటే అశ్రద్ధ పెరిగిపోతుండేవి. వాడికి చెప్పీ చెప్పీ పంతులుగారి ప్రాణం విసిగిపోయింది. సుబ్బమ్మగారితో వాడి చదువు విషయం చెప్పినా ఆవిడ పట్టించుకునేది కాదు. "ఆ .... ఏదో కుర్రతనం .... నాలుగు రోజులు పోతే వాడే చదువుకుంటాడు. వాడి కేమైనా తెలివితక్కువ కనుకనా ?" అనేది. పంతులుగారు వచ్చిన దారినే వెళ్లేవారు. మరీ ఎక్కువగా చెబితే, ఆవిడ ప్రాణం విసిగి "చూడండి పంతులుగారూ .... వాడిని గురించి ఎక్కువ బెంగ పడకండి. వాడు చదివి ఉద్ధరించవలసింది మాత్రం ఎవరిని .... చదువుకోకపోయినా ఉన్నదేదో వాడికి సరిపోతుంది .... వాడికి వచ్చే గిత ఉంటే అదే వస్తుంది. ఏదో వాడికి కాలక్షేపం అవుతుందని బళ్లో వేయించాం కానీ వాడు చదువుకోకపోతే మాత్రం నష్టమేమి ఉంది" అనేది. వచ్చిన పంతులుగార్లు బుర్ర గోక్కుంటూ, మనస్సులో తిట్లు వేసుకుని వెళ్లిపోయేవారు. వాళ్ల ప్రాణం విసిగి వాడి విషయం మళ్లీ ఎప్పుడూ పట్టించుకోలేదు. వాడిని ఒకే క్లాసులో ఉంచడానికి వాళ్లకి ప్రాణం విసిగి ఏ రెండేళ్లకో, మూడేళ్లకో పై క్లాసులోకి నెట్టేవారు.

అవిధంగా ఐదవ ఫారం వరకూ నెట్టుకు వచ్చాడు రఘు. అదిలించేవారు లేకపోవడంతో రఘూ విచ్చలవిడిగా తిరగడం మొదలుపెట్టాడు.

సిగరెట్లు త్రాగడం, పేకాటాడడం మొదలైనవి బహు చురుకుగా నేర్చుకొన్నాడు. బడికి ఎప్పుడో బుద్ధిపుట్టినప్పుడు వెళ్లడం, లేకపోతే పాడుపడ్డ శివాలయంలో, మండపంలో కూర్చుని ఈలవేసుకుంటూ పేకాట ఆడడం. ఏడి వరస సుబ్బమ్మగారికి ఏమీ నచ్చలేదు. కాని వాడిని మందలించే ధైర్యం ఆమెకు లేదు. తండ్రిలేని బిడ్డడు. మనస్సు ఏమి చిన్నబుచ్చుకుంటాడోనని బాధ పడేది. ఇరవయ్యోవడిలో పడ్డా, అతను ఆమెకు పసివాడిలాగానే కన్పించాడు. కొంచెం వయస్సు వస్తే వాడే దారికి వస్తాడు అనుకునేది ఆమె. కాని ఆ ఆశ నిరాశ అయింది. ఎప్పుడైనా మరీ చిరాకెత్తి కొంచెం మందలిస్తే రఘూ ఒక వెర్రినవ్వు నవ్వి వెళ్లిపోయేవాడు. వాడికి కావలసినంత డబ్బు అమ్మ ఇయ్యవలసిందే. లేదా తనే అమ్మ పెట్టెలోంచి తీసుకునేవాడు. ఆమె అడ్డు చెప్పలేకపోయేది.

ఆరోజు ఏ కళ నున్నాడో రఘూ బడికి వెళ్లాడు. ఇంగ్లీషుకి క్రొత్త మాస్టారు వచ్చారు. ఆయన ఆ స్కూలులోనే పనిచేస్తున్నా ఆ క్లాసుకి రావడం అదే క్రొత్త. ఆయనంటేనే బడిపిల్లలకు హడల్. ఆయన క్లాసులోకి రాగానే పిల్లలంతా ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని కూర్చున్నారు. ఆయన

# నేషనల్ ఎక్కో రేడియో



ఒక శుభవార్త!
కొంతపైకము చెల్లించి రేడియో యింటికి తీసుకుపోవచ్చును; మిగిలినది 11 నెలసరి సులభవాయిదాలలో చెల్లింప వచ్చును...

వివరములకు:
రేడియో & ఎలక్ట్రికల్స్
విజయనగరం, విశాఖపట్నం, ఆ.

మనోహరంగా కనబడండి ....




ఆఫ్ఘన్ స్నో
సౌందర్య సాధనములు

AFGHAN SNOW BEAUTY AIDS

ఆఫ్ఘన్ స్నో సౌందర్య సాధనములు మీ అందాన్ని, సొగసును పెంపొందించుటకు తోడ్పడుతుంది... ఆఫ్ఘన్ స్నో సౌందర్య సాధనాలు మీ ముఖలావణ్యం ... మీ వర్చస్సు.. మీ కురులు ... మీ గోరులు ... గూర్చి ...

- ఫేస్ క్రీములు & పౌడర్లు *
- టాయిలెట్ & టాల్కం పౌడర్లు *
- లిప్ స్టిక్స్ & నెయిల్ పాలిష్ *
- బ్రిలియంటైన్స్ & హేర్ ఆయిల్స్ *
- లావెండర్ & ఫ్లవర్ ఫ్యూమ్స్ *
- టాయిలెట్ సోపులు *


# అనుబంధం

"ఏమైనా వచ్చాయా" అని అడిగేది. రాజుని పిలిచి మరీ, మజ్జిగతేట ఇచ్చేది. అతను అది త్రాగి అక్కడ ఒక్క పావుగంటసేపు విశ్రాంతి తీసుకుని తిరిగి బీటుకి వెళ్ళేవాడు. ఆమె నిష్కల్మష హృదయాన్ని అతను ఎంతో అభిమానించేవాడు. అతనికి తెలియకుండానే అతనికి ఆమెపై మాతృభావం ఏర్పడింది. ఆమెతో మాట్లాడుతుంటే అతనికి ఎంతో తృప్తిగా ఉండేది. చనిపోయిన అతని తల్లి జ్ఞాపకానికి వచ్చేది. రాజుకి ఎవరూ లేరు. ఒక్క చెల్లెలు మాత్రం ఉంది. ఆమెకు పెళ్లిచేసి పంపించేశాడు. పాతికేళ్లున్నా తను ఇంకా అవివాహితుడే.

రఘూ తరుచు తల్లికి ఉత్తరాలు వ్రాస్తుండేవాడు. ఆ ఉత్తరాలు రాగానే రాజు ఎంతో సంబరపడేవాడు. ప్రత్యేకంగా త్వరగా తీసికెళ్లి సుబ్బమ్మగారికి ఇచ్చేవాడు. ఆమెకు వయస్సు ముదరటంతో, విచారంతో చూపు ఆనేది కాదు. మనిషి ఆకారం కనిపించినా ముఖం స్పష్టంగా కనిపించేది కాదు. ఇంట్లో పని మాత్రం అలవాటు చొప్పున చేసుకుపోయేది. అందుచేత ఉత్తరం రాగానే రాజుచేతే చదివించుకొనేది. అది చదువుతూ రాజుకూడా సాక్షాత్తూ తన అన్నే వ్రాసినట్లు సంబరపడేవాడు. ఆమె కొడుకు ఎదురుగా ఉన్నట్లే మురిసిపోయేది. అలా ఇద్దరూ ఎంతో సంతోషంగా గడిపేవారు ఉత్తరం వచ్చిన రోజున. సమాధానాలు కూడా రాజు చేతనే వ్రాయించేది. అతను వద్దన్నా వినక పట్టుబట్టి రాజు గురించి కూడా వ్రాసేది.

ఈ ఆరు నెలలలో సుబ్బమ్మగారికి రాజు అతి సన్నిహితు డయ్యాడు. పని పూర్తి అవగానే ఏమీ తోచకపోతే రాజు కూడా వచ్చి అక్కడ అరుగు మీద కూర్చునేవాడు. సుబ్బమ్మగారు రఘును గూర్చిన విషయాలు అన్నీ ఏమీ దాపరికం లేకుండా చెప్తూండేది. చిన్ననాటి ముచ్చట్ల దగ్గర నుంచీ అన్నీ ఎంతో వివరంగా చెప్పేది. అవన్నీ ఎంతో ఆసక్తితో వినేవాడు రాజు. ఏమైనా రఘు ఈనాటికి ప్రయోజకుడైనాడుకదా అని ఇద్దరూ సంతోషించేవారు.

యుద్ధం జరుగుతున్నంతకాలం రఘూ క్షేమం గురించి సుబ్బమ్మగారూ, రాజూ చాలా ఆందోళన చెందేవారు. అతని క్షేమానికై వారు నిత్యమూ భగవంతుని ప్రార్థించేవారు. అతని రాకకై వేయి కన్నులతో ఎదురు చూసేవారు. రఘూ కూడా సాధ్యమయినంత తరచుగా ఉత్తరాలు వ్రాస్తుండేవాడు. ప్రతినెలా తల్లికి ఒక ఇరవై రూపాయలు పంపుతుండేవాడు. ఆమె తన కష్టాలు ఇంక గట్టెక్కాయనే భావించేది. కృష్ణా, రామా అనుకొంటూ కొడుకు చేతిమీదుగా వెళ్లిపోవాలని కోరుకునేది.

యుద్ధం ముగిసింది. ప్రపంచంలో శాంతి తిరిగి నెలకొంది. సైన్యాన్ని ఇళ్లకి పంపించేస్తున్నారు. ఆరోజు రఘూవద్ద నుంచి తల్లికి ఉత్తరం

చ్చింది; మరొక్క నెలలో తాను తిరిగి వస్తు న్నట్లు. ఆ ఉత్తరాన్ని చదివి ఎంతగానో ఆనం దించారు రాజా, సుబ్బమ్మగారూను. ఆ ఉత్త రాన్ని పదేపదే చదివించుకుంది. వారి సంతోషం వర్ణనాతీతం.

రోజు ఒక్క యుగంగా గడుపుతున్నారు. సుబ్బమ్మగారూ, రాజానూ. రఘూ ఎప్పుడు వస్తాడా అని వేయి కళ్లతో ఎదురు చూస్తు న్నారు. రోజూ, రాజా ఇంటివైపు రాగానే ఆమె "అబ్బాయి ఏమైనా వ్రాశాడా" అనేది. "లేదమ్మా .... ఉంటే ఇంత సేపా" అనేవాడు రాజా నవ్వుతూ. అలా ఎదురుచూడగా చూడగా ఒక ఇరవై రోజుల తర్వాత రఘు దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది; తాను వచ్చేనెల 15వ తారీఖున బందర వస్తున్నట్లు. "అబ్బ! వచ్చేనెల పదిహేనవ తారీఖా! ఇంకా ఇరవై రోజులు ఉంది. ఈ ఇరవై రోజులూ గడవటం ఎలా ? ఆ ఆలోచన వచ్చేసరికి వారి హృదయాలు భారంతో క్రుంగిపోయేవి. రఘు మళ్లీ ఉత్తరం వ్రాస్తానని వ్రాశాడు. "పోనీలే. ఉత్తరమేనా ఈలోగా వస్తుందికదా." అని కొంచెం తృప్తిపడ్డారు.

వారం రోజులు గడిచాయి. పది రోజులు గడి చాయి .... పదిహేను రోజులు గడిచాయి. రఘూ వద్ద నుంచి ఉత్తరం లేదు. సుబ్బమ్మగారూ, రాజాల ఆరాటం ఇంతింతని చెప్ప నలవికాదు. రఘు ఎలా ఉన్నాడో ఏమో! ఎప్పుడూ ఉత్త రాలు వ్రాయడంలో ఇంతటి ఆలస్యం చేయలేదు. కారణం ఏమిటయి ఉంటుందో వారిద్దరికీ అంతు పట్టలేదు.

ఆరోజు మధ్యాహ్నం మామూలు ఉత్తరాలు పంచుతూ రాజా సుబ్బమ్మగారింటికి వచ్చాడు. ఆరోజు ఎండ కూడా తీక్షణంగానే ఉంది. మామూలుగానే సుబ్బమ్మగారు అతనిని పిలిచి మజ్జిగ ఇచ్చింది.

ఆమె "మా బాయువ ఈపాటికి బయలుదేరే ఉంటాడు... ఇంకేంతలే. ఇంకో వారం రోజులలో కాదూ!" అంది.

రాజా "రాకేమమ్మా .... తప్పక వస్తాడు". అన్నాడు.

ఆమె "మా బాబుకి పులిహోర; పేమ్యా, నగ్గుబియ్యం కలిపిన పరమాన్నం ఎంతో ఇష్టం. రాగానే అవి చేసిపెడతా. ఆ రోజంతా నీవు కూడా ఇక్కడే ఉండిపోవాలి" అంది.

ఆమె ఇంకా ఏమేమో చెప్పుకుపోతోంది. ఆ మాతృవాత్సల్యం చూస్తుంటే రాజాకి ఒళ్లు పులక రించింది. తనకు ఆ అదృష్టం లేనందుకు కించిత్తు మనస్సు ఖేదించింది. కాని తల్లిని మరిపించే సుబ్బమ్మగారి ఆదరణ జ్ఞాపకానికి వచ్చి తనూ అదృష్టవంతుడనే అనుకున్నాడు.

ఇంక వేళ అవబోతోందని రాజా లేవబోతు న్నాడు. ఇంతలో టెలిగ్రాఫ్ మెసెంజర్ ఎర్ర సైకిల్ వేసుకుని వచ్చి ఇంటిముందు ఆగాడు. లోపలికి వస్తూనే "సుబ్బమ్మగారు ఎవరమ్మా" అంటూ వచ్చాడు. రాజా "ఆ .... ఇక్కడే .... ఏం" అని అడిగాడు.

అతను "ఆమెకు టెలిగ్రాం ఉంది" అంటూ టెలిగ్రాం రాజాచేతి కిచ్చి సంతకం పెట్టించుకుని వెళ్లిపోయాడు.

టెలిగ్రాం అన్నమాట వినగానే సుబ్బమ్మగారి గుండె ఝల్లుమంది. "ఎక్కడినుంచి బాబూ" అంది.

రాజా కూడా ఆతృత పడ్డాడు. "ఇంకెక్కడి నుంచి అయివుంటుందమ్మా .... మన రఘూనే తాను వస్తున్నట్లు టెలిగ్రాం ఇచ్చి ఉంటాడు." అన్నాడు కవరు చింపుతూ.

"నిజంగానే" అంది సుబ్బమ్మగారు ఆనందం పట్టలేక.

కవరు చింపి టెలిగ్రాం తీసి చదువుకోసాగాడు రాజా. అతని కళ్లు గిర్రున తిరిగి పోవడం మొదలు పెట్టాయి. క్రింద నేలంతా తిరిగిపోతున్నట్లని పించింది. ఆ టెలిగ్రాం ఆర్మీ ఆఫీసులు వద్ద నుంచి వచ్చింది. స్వగ్రామానికి తిరిగి వస్తున్న రఘు అస్సాం అడవులగుండా ప్రయాణం చేస్తుం డగా మలేరియాకి గురయ్యాడనీ, క్రితంరోజు బేస్ హాస్పిటల్లో మృతి చెందాడనీ కబురును మోసుకువచ్చింది ఆ టెలిగ్రాం.

అప్రయత్నంగా ఒక వెర్రి కేక వేశాడు రాజా.

"ఏమిటేమిటి" అని కంపిత స్వరంతో అడి గింది సుబ్బమ్మగారు.

ఆమె ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చిన రాజా ఆమెవంక చూస్తూండిపోయాడు అశ్రుపూరిత నయనాలతో.

ఆమె తిరిగి "ఏమిటి బాబూ అంత కేక వేశావు" అని ఆదుర్దాగా అడిగింది.

అతను "ఏమి లేదమ్మా. కండచీమ కుట్టింది కాలివ్రేలిని. అందుచేత అరిచాను. పోయిందిలే" అన్నాడు.

ఆమె "అయ్యో ఎంత పనయిందీ. నెత్తురు వస్తోందా. తడిగుడ్డ తెస్తా ఉండు" అంటూ లోపలికి వెళ్లింది.

ఆమె తిరిగి వచ్చేలోగా రాజా మస్తిష్కంలో అనేక ఆలోచనలు పెను తుఫాను లేకెత్తించాయి. ఆ నిష్కల్మష మాతృమూర్తికి, వేయి కన్నులతో కొడుకు కోసం ఎదురు చూస్తున్న ఆ వృద్ధ మాత జన్మించినదాదిగా కష్టాలే కాని సుఖాలు ఎరగదు. ఆ అభాగ్యజీవికి, పదిమందికీ మంచి చేసినా తాను సుఖపడ నోచుకోని ఆ నిర్భాగ్య జీవికి ఈ వయస్సులో ఈ దుఃఖవార్త చెప్పడం ఎలాగో తెలియులేదు. ఆ వార్త విని ఆమె తట్టుకోగలదా? ఆమె పంచ ప్రాణాలూ పంచభూతైక్యం చెందవా? నిత్యమూ తన నుంచి మంచి వార్తలను మాత్రమే ఎదురుచూసే ఆమెకు ఈ దుఃఖవార్త చెప్పి ఆమెను క్షోభపెట్టడ మెలా ? ఈ ఆలోచనలతో అతను సతమత మవుతున్నాడు.

ఇంతలో సుబ్బమ్మగారు లోపలినుంచి తడి గుడ్డ తీసుకువచ్చింది. "కా లేది బాయునా" అంటూ తడుముకుంటూ అతని దగ్గరకు వచ్చింది.

అప్రయత్నంగా రాజా కాలు ముందుకు సాచాడు. ఆమె కాలివ్రేళ్లని తడిమి వాటికి తడి గుడ్డ చుడుతూ "గాయం ఎక్కడ బాయునా,


తారల సౌందర్య రహస్యము
క్రొత్త ఫేషనులను అనుసరించుట




మోడల్ నెం. 1. ఉచిత కేటలాగుకు:
వి. వి. డ్రస్ Mfg. కో., రాజమండ్రి

SWASTII

చదవండి! చదివించండి!!
కవితా ప్రచురణలు
ఇప్పుడే వెలువడ్డాయి.
మణిది(నవల) ఓగేటి శివరామకృష్ణ రు4-00
ఆంధ్రుల కథ ,, నాయనికృష్ణకుమారి 4-00
విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు (నవల)
విశ్వనాధసత్యనారాయణ రు. 2-50
పై పుస్తకాలు ఒకేసారి తెప్పించుకొను వారికి రు. 9/కే పోస్టేజి మేమే భరింపగలం. మీకే ఇతర పుస్తకాలు కావలసినా మాకు వ్రాయండి. కేటలాగు వుచితం.
వివరాలకు:
కవితా పబ్లికేషన్స్,
28-15-18/1, అరండల్ పేట,
విజయవాడ — 2.



# ఫిలిప్స్ ఇంటర్ నేషనల్



B4CA97A

నూతన శాస్త్ర పరిశోధనలతో తీర్చి దిద్దబడిన అధునాతనమైన AC రేడియో

Excise Duty తో సహా రు. 551/-

సేల్సు టాక్సు అదనము.

PHILIPS

విజయ అండ్ కో., గుంటూరు, మాచర్ల.

శ్రీనివాస్ స్టోర్సు, గాంధిచౌక్, తెనాలి.



దీపావళి శుభసమయమున మా శుభాకాంక్షలు

## ప్రతి ఇంటిలోను ప్రఖ్యాతిగాంచినది.




# పి.సి.పి.

కాఫీ (రిజిష్టర్డు)

తాజాతనానికి, శుభ్రతకు, నాణ్యమునకు

ప్లాంటర్సుకాఫీ ప్రాపగాండా, గుంటూరు 2

బ్రాంచిలు: అరండల్‌పేట, పట్నంబజారు, తెనాలి, బాపట్ల, చీరాల, పొన్నూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, బెజవాడ, మచిలీపట్నం, గుడివాడ, రాజమండ్రి, ఏలూరు, అమరావతి..... డిస్ట్రిబ్యూటింగ్ సెంటర్:— తుని.


## అనుబంధం

రక్తం వచ్చినట్లు లేదే" అంటూ గుడ్డను చుట్టడం పూర్తి చేసింది.

అందుకు సమాధానంగా ఆమె ముంజేతిమీద రెండు కన్నీటి చుక్కలు పడ్డాయి. రాజుకు పెల్లుబికి వస్తున్న కన్నీటికి ఆనకట్ట కట్టగలిగినా, ఆ రెండు చుక్కలూ మాత్రం, అతని ప్రయత్నం నుంచి తప్పించుకుని క్రిందకు జారగలిగాయి.

"ఏమిటి నాయనా" అంది సుబ్బమ్మగారు ఆదుర్దాగా.

"కుట్టినది కందిచీమైనా తేలు కుట్టినంత బాధగా ఉందమ్మా. మరేం దిగులు పడకు. అదే తగ్గిపోతుంది" అన్నాడు గద్గదస్వరంతో.

"ఓర్చుకో నాయనా. తడిగుడ్డ చుట్టగా కొద్ది సేపట్లోనే తగ్గిపోతుంది .... ఆఁ మరిచాను .... ఇంతకీ ఆ టెలిగ్రాం ఏమిటి నాయనా ?" అంది. ఈ హడావుడిలో దాని సంగతే మరిచిపోయింది. ఆమె.

ఆ ప్రశ్న రాజుని వేయి శూలాలతో గ్రుచ్చింది. ఏమి బదులు చెప్పాలో తెలియక కొట్టు మిట్టాడుతూ అప్రయత్నంగా "మన రఘువర్ధనుంచే నమ్మా. అన్న ప్రకారం 15వ తారీఖుకి వస్తున్నాడుట" అనేశాడు.

"ఆఁ .... నిజంగా .... ఎంతటి చల్లని మాట చెప్పావు నాయనా. వెయ్యేళ్ళు చల్లగా వర్ధిల్లు. నీ నోటితో ఎప్పుడూ శుభాన్నే చెబుతావు. ఉండు. నీ నోరు తీయజేస్తాను" అంటూ లోపలికి వెళ్లింది.

తాను ఏమి చెప్పాడో గ్రహించుకున్న రాజు దాని పర్యవసానం . ఏమవుతుందో తెలియక కొట్టు మిట్టాడుతున్నాడు. తెలియని భయంతో తల పట్టుకుని కూర్చుండిపోయాడు.

ఇంతలో సుబ్బమ్మగారు లోపలనుంచి కొంచెం పటికబెల్లం తీసుకువచ్చింది. "ఇదిగో నాయనా. నోరు తెరు. నా చేతితో నీ నోటికి అందిస్తా." అంటూ దగ్గరికి వచ్చింది.

ఆనందమయమూర్తిని చూస్తుంటే, ఆమెకు కలిగిన దుఃఖాన్ని తలుచుకుంటుంటే రాజుకి దుఃఖం ఆగలేదు. పట్టు బలవంతంమీద ఆపు కున్న దుఃఖం ఒక్కసారి కట్టలు తెంచుకుంది. "పద్దమ్మా" అంటూ ఆమెను కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్చాడు.

"ఏమిటిది నాయనా .... ఏ. ఏ. ఏమి జరిగింది." అంటూ కంగారుగా అడిగింది సుబ్బమ్మగారు.

"ఏమీ లేదమ్మా .... ఈ ఆనంద సమయంలో నీవు పడ్డ కష్టాలన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. నీ కష్టాలన్నీ ఈనాటికైనా గట్టెక్కుతున్నాయి. కదా అని ఆనందం వేసింది. ఆ ఆనందాతిశయం పట్టలేక ఏడుపు వచ్చిందమ్మా" అన్నాడు. గట్టి ప్రయత్నంమీద దుఃఖాన్ని దిగమ్రింగుకుని.

"నిజమే నాయనా. కష్టాలు కలకాలం ఉంటాయా. ఆ రామచంద్రుడు ఇన్నాళ్లకి వన్నె చల్లని చూపు చూశాడు. ఇంకముందు మీ రిద్దరే నాయనా ఈ గ్రుడ్డిదానికి రెండు కళ్ళూనూ

అంది కన్నీళ్ళు వత్తుకుంటూ.

రాజా ఇంక "నేను వెళ్ళి వస్తానమ్మా. చాలా పొద్దైంది" అంటూ సంచి భుజాన వేసుకుని భారంగా నడక ముందుకు సాగించాడు.

అతను వెళ్ళిన వైపే ఆర్ద్ర నయనాలతో చూస్తూ ఉండిపోయింది ఆమె. ఆమె భౌతిక నేత్రాలకు చూపు తక్కువ కావచ్చు. కాని ఆమె మనోనేత్రాలముందు రాజా దివ్యజ్యోతిలా వెలిగి పోతున్నాడు.

## 5

ఆరోజు రాజా సరిగ్గా పనిచేయలేక పోయాడు. ఏదోవిధంగా పని పూర్తిచేసి ఆ సాయంత్రం మనస్సుకి ప్రశాంతత కొరకు సముద్రంవైపు వెళ్ళాడు. మంగినపూడి బీచిలో ఇసుకతిన్నెలమీద కూర్చుని ఎగిరెగిరి పడుతున్న కెరటాలను చూస్తుంటే అతని హృదయంలోంచి అనేక భావనా తరంగాలు వెలువడినాయి. ఏమిటీ సముద్రం ! దీనికి ప్రశాంతత అంటూ ఉండదా ? దూరంనుంచి ఎంతటి గంభీరంగా, ప్రశాంతంగా కన్పిస్తుంది అవిరళంగా వచ్చే ఈ అలలతో నిత్యమూ అల్లకల్లోలంగా ఉండే ఈ సముద్ర గర్భము ! చిన్న అలలను పెద్ద అలలు వచ్చి ముంచివేస్తున్నాయి. కొందరి జీవితాలూ అంతే కాబోలు. కొందరిదాకా ఎందుకు. సుబ్బమ్మగారి జీవితం అంతే కదా ! ఆ సముద్రాన్ని చూస్తుంటే రాజా మనస్సు పరిపరి విధాల పోతోంది.

తానెవరు ? సుబ్బమ్మగారెవరు ? ఏమిటీ ఋణానుబంధం. ఆమె కొడుకు మరణవార్త దాచి పెట్టడానికి తనకు ఏమి హక్కు ఉంది ? ఆ వార్త వింటే ఆమెకి మతి భ్రమించవచ్చు. లేదా గుండె పగులవచ్చు. ఏమైనా కావచ్చు. కాని అందుకు తాను ఏవిధంగా బాధ్యుడు ? అనాలోచితంగా తాను ఆమెవద్ద రఘూ 15వ తారీఖున వస్తున్నాడని అబద్ధమాడేడే ! ఆరోజు రఘూ రాలేదేమని ఆమె అడిగితే తానేమి సమాధానం చెప్పగలడు ? ఏవిధంగా నాటక మాడగలడు .... ఎన్నాళ్ళ ఆడు తాడు.... దాని పర్యవసానం ఏమిటి ? పోనీ ఇప్పటికైనా చేసిన తప్పులు ఒప్పుకుని నిజం చెప్పేస్తే ? ఎలా జరుగవలసి ఉంటే అలా జరుగుతుంది. అమ్మో ! ఆ దుర్వార్త ఆమె చెవిని పడడానికి వీలు లేదు. అంతుకు ఆమె తట్టుకోలేదు. తనకు తల్లి లేని లోటు తీర్చిన ఆమెకు ఏ కష్టం రానీయ కూడదు. ఎన్ని కష్టాలకైనా ఓర్చి ఆమెను సుఖ పెట్టాలి. ఆమెకు మాత్రం ఈ దుర్వార్త తెలియ నీయకూడదు. అందుకు అవసరమైన నాటకాలు ఎన్ని ఆడడానికైనా తాను సిద్ధపడవలసిందే.

రాజా ఒక్కసారి ఆత్మవిమర్శ చేసుకున్నాడు. తనకు ఎవరు ఉన్నారు ! ఎవ్వరూ లేరు. ఒక్క చెల్లెలు తప్ప నా అన్నవాళ్లెవరూ లేరు. ఆమె కూడా ఎక్కడో దూరాన భర్తతో కాపురం చేస్తోంది. తనమీద ఆధారపడినవాళ్ళుకాని, తాను లేకపోతే దిగులుపడేవారుకానీ ఎవరూ లేరు. సత్ర భోజనం, మఠం నిద్రగా కాలం గడుపుతున్నాడు. తన జీవితం ఏమయిపోతేనేం ? తన శేష జీవితాన్ని ఆ వృద్ధమాత సౌఖ్యం కోసం ఎందుకు ధారపోయ కూడదు ? అందుకు తాను రాజాగా నిర్గమించాలి. రఘుగా అవతరించాలి. జాగ్రత్తగా మసులు కుంటూ సుబ్బమ్మగారికి ఏవిధమైన అనుమానమూ రాకుండా రఘుగా ప్రవర్తించాలి.

రాజా కృతనిశ్చయు డయ్యాడు తాను రఘుగా సుబ్బమ్మగారి జీవితంలో ప్రవేశించడానికి. ఈ ఆలోచన వచ్చేసరికి అతని హృదయం నుంచి వెయ్యి ఏనుగుల బరువు దించివేసిన ట్లయింది. మనస్సు ఎంతో తేలిక పడింది. హృదయం ఆనందంలో నిండి కళ్ళు చెమ్మగిల్లాయి. కళ్ళు తుడుచు కుంటూ రాజా తలెత్తి ఆకాశంలోకి చూశాడు. పూర్ణిమ చంద్రుడు చిరునవ్వుతో సముద్రంనుండి పైకి వస్తున్నాడు. సముద్రపు టలలు చంద్ర కిరణాలు పైబడి కరగించిన వెండల్లే మెరుస్తున్నాయి. దూరాన సరుకుతోటలు సంగీతం పాడుతున్నాయి.

రాజా పథకం బాగా ఆలోచించుకున్నాడు. తాను రఘుగా 15వ తారీఖునాటికి సుబ్బమ్మగారింట అడుగు పెట్టాలి. ఆనాటితో రాజా మరణిస్తాడు. రఘు పునర్జన్మ ఎత్తుతాడు. ఊళ్లో ఉంటే ఈ రహస్యం త్వరలోనే వెల్లడవుతుంది కనుక ఆలస్యం లేకుండా వేరే ఊరికి బదిలీ చేయించుకుని, అక్కడికి సుబ్బమ్మగారితో తరలి పోవాలి. ఆ తర్వాత భగవత్కృప ఎలా ఉంటే అలా జరుగుతుంది.

తేలికపడ్డ హృదయంతో రాజా లేచాడు. ఒంటి మీద దుమ్ము దులుపుకుని ఇంటిదారి పట్టాడు. ఆ రాత్రి హోటలుకి వెళ్ళి భోజనం కూడా చేయ లేదు. ఇంటికి వచ్చి దీపమైనా వెలిగించుకోకుండా పడక వేశాడు. ఎంత ప్రయత్నించినా ఎడతెగని ఆలోచనలతో నిద్ర పట్టలేదు. తెల్లవారు ఝామున మాత్రం కలత నిద్ర పట్టింది.

## 6

సంతోషం పట్టలేక సుబ్బమ్మగారు ఆ వాడ వాడంతా రఘూ ఆగమనం సంగతి చెప్పివేసింది. ఆమె అభిమానులు అందుకు చాల సంతోషించారు. 14వ తారీఖున రాజా మామూలుగా సుబ్బమ్మగారింటికి వచ్చాడు. కాసేపు పిచ్చాపాటీ మాట్లాడినాక "అమ్మా ఒక సంగతి చెబుతాను. మరేమీ బెంగపడకు" అన్నాడు.

"ఏమిటి నాయనా అది ? రఘు రావడం లేదని ఏమైనా వ్రాశాడా ?" అంది కొంచెం నిరాశగా.

"కాదమ్మా. రేపు రఘు తప్పక వస్తాడు. కాని అతను వచ్చేసరికి నేను ఉండను. నాకు అత్యవసరంగా నూజివీడుకు బదిలీ అయింది. ఈ రాత్రే వెళ్ళిపోవాలి. త్వరలో వీలుచూసుకుని వచ్చి మళ్ళీ మిమ్మల్ని కలుస్తాను" అన్నాడు.

ఈ వార్త అశనిపాతంలాగా సుబ్బమ్మగారి చెవులను సోకింది. "అదేమిటో నాయనా రఘు రావడం నీవు వెళ్ళడమూనా .... పోనీ పదిరోజులు పోయాకైనా వెళ్ళకూడదా ? మీ అయ్యగారింటికి నన్ను తీసుకువెళ్ళు. ఈ ముసలిది బ్రతిమాలుకుంటేనైనా ఏమైనా కనికరిస్తారేమో" అంది.

"బేలదానివే అమ్మా .... గవర్నమెంటు పనులు మన వీలు ప్రకారం జరుగుతాయా ? ఈ కాస్త దానికి బెంగపడిపోతే ఎలా. వీలు చూసుకుని సాధ్యమయినంత త్వరలో మళ్ళీ వచ్చి మీ ఇద్దర్నీ చూస్తాగా" అన్నాడు రాజా.

"ఏమోలే నాయనా .... కానీ .... భగవంతుడు నా మొఖాన్న ఇంతే రాశాడు .... వెళ్ళిరా .... ఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకో" అంది.

"వస్తానమ్మా .... రఘు వచ్చాక అడిగానని చెప్పు" అంటూ బయటకు వెళ్ళబోయాడు రాజా.

"నాయనా .... రాజా .... ఉండు" అంటూ వెనకాలే వచ్చింది ఆమె.

"అయోమయం మనిషిని .... వెళ్ళేది పరాయి ఊరు .... అసలే హోటలు భోజనం పడుతుందో పడదో .... కొంచెం ఊరగాయలు పట్టుకు తీసికెళ్ళు" అంది ఆప్యాయంగా.

రాజాకి కళ్ళలో నీరు గిర్రున తిరిగింది. "వద్దమ్మా .... నీ అభిమానమే నాకు పదివేలు. మళ్ళీ త్వరలోనే వస్తానుగా .... అప్పుడు తీసుకు వెళ్తా .... ఈలోగా గదీ అదీ కుదుర్చుకుని మళ్ళీ వస్తాను" అని వెళ్ళిపోయాడు.

ఇంతటి అమృతహృదయం గల తల్లి వాత్సల్యాన్ని బ్రతికుండగా దూరం చేసుకుని, పొందుదామని వస్తూన్న సమయంలో కన్ను మూసిన రఘు దురదృష్టం తలుచుకుంటే రాజాకు విచారం వేసింది.

## 7

ఆ మర్నాడు 15వ తారీఖు రానే వచ్చింది. రాజా ఆఫీసుకు సెలవు పెట్టాడు. [illegible] కంపెనీలో [illegible] అద్దెకు తీసుకున్నాడు. [illegible] తలకి [illegible] చుట్టాడు. గడ్డం [illegible] శాడు. కళ్ళకు నల్ల కళ్ళజోడు పెట్టాడు. కాళ్ళకు తను ఎప్పుడో కొన్న బూట్లు పాలిష్ చేయించి తొడిగాడు. తన పాత లెదర్ కేసుకి క్రొత్త కవరు కుట్టించాడు. ఉద్యోగంలో చేరేటప్పుడు కొన్న హోల్డాలులో పరుపూ గిరుపూ వేసి అట్టహాసంగా తయారుచేశాడు. సుబ్బమ్మగారికి బజారులో ఒక మంచి బనారస్ పట్టుచీర కొన్నాడు. రఘుగా అవతరించడానికి సిద్ధంగా ఉన్నాడు.

ఆ ఊరి పోస్టల్ ఇన్స్పెక్టరు గారికి రాజంటే అమితమైన అభిమానం. అతని నిజాయితీని, పనినీ ఆయన చాలా అభిమానించేవారు. అతనిపై ఆయనకు పుత్రవాత్సల్యం ఉండేది. రాజాకు కూడా ఆయనంటే పితృభావం ఉండేది. నాలుగు రోజుల క్రితమే రాజా ఆయనింటికి వెళ్ళి తనని 16వ తారీఖుకల్లా విజయవాడ బదిలీ అయ్యేటట్టు చేయమని ప్రాధేయపడ్డాడు. ఆయనకు రాజా

స్థాపితం 1920
## రెడ్డి & కో. (రిజిష్టర్డు)
గోపాలపురం — తూ. గో. జిల్లా
బొల్లి, మేహపొడ, మేహమచ్చలు
దగ్గరా సమస్త చర్మవ్యాధులకు
ప్రత్యేక చికిత్స
శాస్త్రీయ ఆయుర్వేద ఔషధములు
లభించును.
తెల్గాగు సలహా ఉచితం.

## తరచుగా మూత్రవిసర్జన

చక్కెరతోగాని, చక్కెర లేకుండగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలి ప్రమాదకరమైన విషయము. శరీరాన్ని గుల్ల చేయడమే కాకుండా ఈ వ్యాధి, తన బంధంలో చిక్కినవారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక, మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుముతో నొప్పి, చూపుమాంద్యము, తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో ఈ వ్యాధి పొడచూపును. పై లక్షణములతో కూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో, అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో పగుళ్ళు, తూకం తగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ళనొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, ఇట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యేర్పడ సంభవించవచ్చును.

"పినస్ ఫారవ్" మాత్రలు వాడి అనేక వేలమంది తమ బాధలనుండి నివారణపొంది మృత్యు కరాళమునుండి రక్షింపబడిరి. "పినస్ ఫారవ్" శాస్త్రీయ పద్ధతులమీద ప్రాచీన యూనాని వైద్య విధానం ప్రకారం అమూల్య ఔషధుల శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. అమిత దాహము, మూత్రంలో చక్కెర తగ్గి పలుమారు మూత్ర విసర్జనచేయు అవసరము 2 లేక 3 రోజులలోనే మీకు చాలా భాగము నివారణ యగును. కొద్దిరోజులలోనే మీకు నిగావికిపైగా స్వస్థత చేకూరినటు నిపించును. "పినస్ ఫారవ్" కొద్ది వ్యయముతో సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేక పథ్యములేదు. నిరాహారముతోనుండే అవసరంలేదు. రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై ఇదివరకటికంటే ఎక్కువరకాల ఆహార పదార్థములు తీసికొనవచ్చును. వివరములుగల ఇంగ్లీషు కరపత్రములు అడిగినవారికి ఉచితముగా పంపబడును. 50 బిళ్ళల ఖరీదు రు. 8–75 న.పై. మాత్రమే. ప్యాకింగ్ మరియు పోస్టేజి ఉచితం.

(SELLING AGENTS)
Barrys Commercial Corporation
(W. A. P.)
27/A, Dhurumtollah Street
CALCUTTA-13.

## అనుబంధం

చెబుతున్నది ఏమిటో అర్థం కాలేదు. రాజా వివరాలు మాత్రం చెప్పలేదు. అన్నీ వివరంగా చెబుతానని, తనకి తప్పక ఈ సహాయం చేయమనీ మరీ మరీ ప్రాధేయపడ్డాడు. ఇంకా గుచ్చిగుచ్చి అడిగేసరికి రాజాకి కళ్ళనీళ్ల పర్యంతం అయింది. దాంతో ఇనస్పెక్టరుగారు "నీవు అన్నీ తెలిసినవాడివి. నీకు చెప్పేదిలేదు. నీకు విజయవాడ వెళ్లడం వలన మంచి జరుగుతే తప్పక నిన్ను బదిలీ చేయిస్తాను. నిన్ను వదులుకోవడం నాకు బాధగానే ఉంటుంది. కానీ నీ సౌలభ్యం కోసం ఈ సహాయం తప్పక చేస్తాను. 16 కల్లా నీకు బదిలీ అయ్యేటట్లు చూస్తాను. నీవు సిద్ధంగా ఉండవచ్చు. ఈలోగా ఒకవేళ నీవు నీ అభిప్రాయం మార్చుకునేటట్లయితే మాత్రం వెంటనే నాకు తెలియజేయి" అన్నారు.

కృతజ్ఞతతో రాజా కళ్ళు ఆర్ద్రపూరితాలయినాయి. రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెట్టి భారంగా కదిలి వెళ్లిపోయాడు. అతని బాధ ఏమిటో అర్థంకాక ఇనస్పెక్టరుగారు అలాగే విచిత్రంగా అతను వెళ్లినవైపే చూస్తూండిపోయారు.

సాయంత్రం ఆరు గంటలయింది. శీతాకాలం ప్రొద్దేమో అప్పుడే చీకటి బాగా క్రమ్ముకుంటోంది. రఘు ఇంకా రాలేదేమా అని సుబ్బమ్మగారు అరుగుమీదే కూర్చుని ఆందోళనతో ఎదురు చూస్తోంది. రఘు వస్తాడుకదా చూద్దామని చుట్టుప్రక్కల అమ్మలక్కలు నలుగు రైదుగురు కూడా సుబ్బమ్మగారి దగ్గరే అరుగుమీద కూర్చున్నారు. అరయినా రాకపోయేసరికి వాళ్ళు వంటకి ఆలస్యం అయిపోతోందని అప్పుడే వెళ్లిపోయారు. సుబ్బమ్మగారు ఒక్కత్తే చూపు తక్కువ కళ్లను వేయి కళ్ళుగా చేసి, దిగులుగా అరుగుమీద కూర్చుని వచ్చే పోయే వారిని చూడడానికి వ్యర్థ ప్రయత్నం చేస్తోంది.

మరో పావు గంటలో సుబ్బమ్మగా రింటి ముందు ఒక సైకిల్‌రిక్షా ఆగింది. అందులో నించి రాజా దిగాడు వేషం మార్చి, "అమ్మా" అని కేకవేసి "సామాను లోపల పెట్టవోయి" అన్నాడు రిక్షావాలాతో.

ఈ స్వరం సుపరిచిత మయినదే సుబ్బమ్మగారికి. "ఎవరూ .... రాజా" అంది.

"కాదమ్మా .... నేను రఘుని .... వస్తున్నానమ్మా ...." అంటూ చేతులు చాస్తూ దగ్గరిగా వెళ్లాడు. చేస్తున్న మోసానికి కాళ్ళు వెనకాడాయి. కాని సంకల్పదీక్ష ముందుకు నెట్టింది.

"రఘూ" అంటూ ఒక్క ఉదుటున వచ్చి అతనిని పెనవేసుకుంది సుబ్బమ్మగారు. ఆపేక్షగా ముఖం, భుజాలు, చేతులూ తడిమివేస్తోంది. "వచ్చావా నాయనా. దురదృష్ట వంతురాలిని .... నిన్ను స్పష్టంగా చూడలేను .... పోనీలే నాయనా... భగవంతుడు ఈనాటికైనా నన్ను దయతలిచాడు.. ఎంత మారిపోయావు బాబూ .... అయ్యో .... కడుపు ఎంత లోతుకు పోయింది .... ఎప్పుడు తిన్న అన్నమో ఏమో .... లోపలికి పద నాయనా అన్నం తిని మాట్లాడుకుందాం." అంటూ ఆప్యాయత వర్షంలా కురిపించింది. ఇంకిపోయిన ఆమె కళ్లల్లో నుంచి ఊట బావిలోని నీరువలె సంతత ధారగా ఆనందబాష్పాలు కారడం మొదలుపెట్టాయి.

ఆ తల్లి ఆపేక్షను చూస్తుంటే రాజాకా దుఃఖం ఆగలేదు. గద్గదస్వరంతో "అమ్మా! నేను నిన్ను చాలా బాధలు పెట్టానమ్మా .... నన్ను క్షమించా నమ్మా ...." అని వాపోయాడు.

"అవేం మాటలు నాయనా .... నీవు మాత్రం చేసింది ఏముంది ? ఎలా జరగాలో అలా జరిగింది. ముందు లోపలికి పద నాయనా" అంటూ చేయి పుచ్చుకుని లోపలికి తీసుకుపోయింది.

రాజా " అమ్మా .... నేను రాగానే "రాజా" అని పిలిచావు .... రాజా—తమ్ముడి గొంతు కూడా ఇలాగే ఉంటుందా అమ్మా" అని అడిగాడు లోపలికి వెళ్తూ.

ఆమె "అవును నాయనా .... ఇద్దరి గొంతులకూ ఏమీ తేడా లేదు. మనిషి కూడా ఎంత మంచివాడనుకున్నావు .... మనస్సు నవనీతం అనుకో .... వ్రేళ్లమీద లెక్కించవచ్చు అటువంటివాళ్లని .... అందుకే కాబోలు భగవంతుడు రాజాని నాకు రెండో కొడుకుగా పంపించాడు." అంది కూర్చున్న రాజా తల నిమురుతూ. కృతజ్ఞతతో రాజా హృదయం ఉప్పొంగి పోయింది. ఆనందబాష్పాలతో కళ్ళు మిలమిలా మెరిశాయి. అప్రయత్నంగా రెండు చేతులూ ఎత్తి నమస్కరించాడు.

రాజా "మరి రాజా రాలేదేమమ్మా .... అతని ఆఫీసు ఇంకా అవదా .... పోనీ నేను వాళ్ల ఆఫీసుకు వెళ్లి పిలుచుకురానా ?" అన్నాడు.

ఆమె బరువుగా నిట్టూర్చి "వద్దు నాయనా .. అతనికి అత్యవసరంగా నూజివీడుకి బదిలీ అయింది. వెళ్లడానికి ఎంతో బాధపడుతూ వెళ్లాడు. వెళ్ళే ముందు సాధ్యమయినంత త్వరలో వచ్చి నిను చూస్తానని మాట ఇచ్చాడు" అంది.

రాజా "అయ్యో .... అలాగా .... నీవు వ్రాయించిన ఉత్తరాలు చూస్తుంటే రాజాని తలుచుకుని నాకు తమ్ముడు లేని లోటు తీరిందని తృప్తిపడేవాడిని. నేను దూరంగా ఉన్నా, నిన్ను కనిపెట్టడానికి అతను ఉన్నాడు కదా అని ధైర్యంగా ఉండేది. కానీలే అమ్మా .... త్వరలోనే అతన్ని కలుసుకునే ప్రయత్నం చేస్తాను" అన్నాడు.

ఆమె "అలాగే నాయనా .... లే. ముందు బట్టలు మార్చుకుని స్నానం చేయి. ఈలోగా భోజనాలు పని చూస్తాను" అంటూ లోపలికి వెళ్లింది.

రాజా కళ్ళు మూసుకునే "భగవంతుడా .... ఈ నిష్కల్మష మాతృమూర్తిని ఇంతవరకూ వమ్మించాను. ఈ నాటకం ఇకముందు కూడా సవ్యంగా సాగేటట్లు అనుగ్రహించు తండ్రీ ...." అని మనస్సులోనే ప్రణమిల్లాడు.

### 8

భోజనాలయి కబుర్లు చెప్పుకుంటూ తీరికగా కూర్చున్నారు ఇద్దరూ. రాజా "అమ్మా! చెప్పడం మరిచాను. విడుదల చేసిన సైనికులకు ప్రభుత్వం వారు ఉద్యోగాలు ఇచ్చారు. నాకు విజయవాడలో పోస్ట్‌మేన్ ఉద్యోగం ఇచ్చారు. మనకి దగ్గరైనా విజయవాడలో వేయించుకోడానికి చాలా కష్టపడవలసి వచ్చింది. రాజా—తమ్ముడిలాగానే నాకు కూడా పోస్టుమేన్ ఉద్యోగం దొరకడం ఎంత విచిత్రంగా

ఉంటున్నా — ప్రయత్నించి రాజు కూడా అక్కడే బదిలీ అయ్యేటట్లు చూస్తాను. ఇద్దరం కలిసే ఉండవచ్చు" అన్నాడు.

ఆమె "అలాగా బాయనా .... బాగుంది .... అలాగే చేయి .... ఎప్పుడు వేరా అక్కడ" అంది.

"రేపే వెరాలి అమ్మా .... రేపటితో ఐన్నుకి వెళ్ళిపోతా .... అక్కడ తెలిసిన స్నేహితుడు ఉంటే చిన్న భాగం మాట్లాడించా. ముందు అక్కడకు వెళ్ళాక నిన్ను తీసుకువెళ్ళే ఏర్పాటు చేస్తాను" అన్నాడు రాజా.

ఆమె "వద్దు బాయనా వద్దు .... నేను కూడా నీతోనే వస్తా .... నిన్ను విడచి ఉండలేను. ఇల్లు తాళంపెట్టి పోదాం" అంది.

"అలాగే. నీ ఇష్టం .... వెంటనే రావడానికి నీకు వీలవుతుందో అవదో అని అన్నాను .... సరే ... సామాను సర్దుకుని సిద్ధంగా ఉండు" అన్నాడు రాజా. చుట్టుప్రక్కల నాలుగు ఇళ్లలో మాత్రం సుబ్బమ్మగారు తన కొడుకు వచ్చిన సంగతే, తాము తెల్లవారి విజయవాడ వెళ్లిపోతున్న సంగతీ చెప్పి వచ్చింది. రఘుని చూడాలనుకున్న ఆ చుట్టుక్క జనానికి ఆశాభంగం అయింది.

తెల్లవారుఝామున సైకిలురిక్షాలో రాజా, సుబ్బమ్మగారూ బస్సు స్టాండుకు వెళ్ళిపోయారు. ఇరుగుపొరుగు ఆడవాళ్ళు రఘుని చూడాలనే ఆత్రంతో అరుగులమీద నిలబడి చూశారే కాని వాళ్ళకి కదలిపోతున్న ఒక పురుషుని, ఒక స్త్రీ యొక్క ఆకారాలు మాత్రమే కనిపించాయి. అతని ముఖం స్పష్టంగా చూడలేకపోయారు. నిరాశతో తిరిగి ఇళ్లల్లోకి వెళ్ళిపోయారు.

ఆ వాడలో జనం ఎవ్వరూ తనని గుర్తుపట్ట కూడదనే రాజా జాగ్రత్తపడ్డాడు. అందుకే క్రితంరోజు సాయంత్రం చీకటిపడ్డాక వచ్చాడు. తెల్లవారకముందే ఊరు మార్చివేశాడు. ఈలోగా ఎవరైనా తనను గుర్తుపడితే తాను ఆడుతున్న నాటకానికి భరతవాక్యం పలుకవలసి వస్తుందని భయపడ్డాడు. అతని ప్రయత్నానికి భగవంతుడు సాయపడ్డాడు.

రాజా, సుబ్బమ్మగారు విజయవాడలో కాపురం పెట్టారు. బందరులో ఉన్న ఇల్లు ఖాళీచేసి సామాను విజయవాడకి తరలించేశారు. అక్కడ ఇల్లు అద్దెకిచ్చేశారు. అచిరకాలంలోనే ఆ వాడ జనం వాళ్లిద్దరినీ పరోక్షంగా, ప్రత్యేకంగా గుర్తించుకోడం మానేశారు.

విజయవాడ వచ్చిన వెంటనే సుబ్బమ్మగారు, రాజాకి ఆ విషయం వ్రాయమని చెప్పింది. రాజా అలాగేనని తాము అక్కడికి వచ్చిన సంగతీ, త్వరలో తమను కలుసుకోమని ఉత్తరం వ్రాశాడు. అది తన జేబులోనే వేసుకున్నాడు.

రాజా రఘుగా ఎంతో జాగ్రత్తగా వ్యవహరిస్తూ వస్తున్నాడు. సుబ్బమ్మగారు రఘుని గూర్చి చెప్పిన అనేక విషయాలు అతనికి జ్ఞాపకం ఉన్నాయి. వాటిని ఆధారం చేసుకుని ఏవో కబుర్లు అల్లి చెప్పేవాడు. అవి విని ఆమె మురిసిపోయేది. సైన్యంలో తాను ఏవేవో చేసినట్లుగా కల్పించి చెప్పేవాడు. అన్నీ ఆశ్చర్యంతో నోరు తెరుచుకుని, చెవులు రిక్కించి వినేది ఆమె. రాజాకీ తనకూ మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతున్నట్లు లేఖలు సృష్టించేవాడు. ప్రతి ప్రత్యుత్తరంలోను రాజా ఏదో కారణంవల్ల రాలేకపోతున్నట్లు వ్రాసేవాడు.

ఆవిధంగా ఒక్క ఆరు నెలలు అమితానందంగా గడిచిపోయింది సుబ్బమ్మగారికి. ఈ ఆరు నెలల లోనూ ఆమెకి బాధ కలిగించింది రాజా ఒక్కసారి కూడా కన్పించకపోవడమే. చివరికి ఉండబట్టలేక రఘునే ఒకసారి రాజా దగ్గరికి వెళ్ళి చూసి తీసుకురమ్మనమని పోరింది. రాజా "అలాగే" అని ఒకరోజు సెలవు పెట్టి, ఊరికే గుంటూరు వెళ్ళి ఒకరోజు గడిపి తిరిగి వచ్చాడు.

"అమ్మా .... మాజీవీడుల్లో రాజాను కలిశానమ్మా .... ఎంత ఆప్యాయంగా మాట్లాడా డనుకున్నావు .... ముందు నే నెవరా అని కొంచెం ఆశ్చర్యపోయాడు. తర్వాత తెలిశాక గట్టిగా కౌగలించుకుని వదలలేదనుకో .... నీ గురించి ఎన్ని ప్రశ్నలు అడిగాడో ...." అన్నాడు నేర్పుగా కల్పించి చెబుతూ.

"మా బాయనే .... మా బాయనే .... మా రాజాకి నేనంటే అంతటి ఆపేక్ష .... మరింతకీ తను రాలేదే!" అని అడిగింది ఆమె.

"ఈ నెల సెలువాదుట .... వచ్చే నెలాఖరుకి తప్పక వస్తానన్నాడు .... వచ్చి నిన్ను తీసుకు వెళ్తాడుట ...." అన్నాడు అతను. ఆమె కళ్ళు సంతోషంతో ఆర్ద్రం అయ్యాయి.

సుబ్బమ్మగారికి ఇప్పుడు ఏ బెంగా లేదు. ఉన్న బెంగల్లా రఘుకి ముందూ, ఆ తర్వాత రాజాకీ పెళ్లి చేయాలనే. ఆ విషయమై రఘుతో పోరుతుండేది. 'రఘూ' "ఇప్పుడు తొందరేముందమ్మా .... కాస్త డబ్బు వెనకేసుకోనీ .... నేనూ రాజా ఒక్కసారే పెళ్ళాడుతాములే ...." అని కాలం జరిపేశేవాడు. సుబ్బమ్మగారు తనకి వచ్చే వయస్సే కాని పోయే వయస్సు కాదని, తా నుండగానే ఆ ఇద్దరి ముచ్చటా చూడాలనీ పట్టుబట్టేది. అప్పుడప్పుడు కోపం వచ్చి "ఇంక ఈ చేతులు కాల్చుకోవడం నా తరం కాదు బాబూ" అని కేకలు వేసేది. 'చూద్దాంలే' అని తప్పించుకునేవాడు రాజా.

## 9

ఇలా ఒక్క ఏడాది గడిచింది. రోజులు ఎంతో సంతోషంగా గడిచిపోతున్నాయి. రాజాకి మాత్రం మనశ్శాంతి కరువయింది. ఆ నిష్కల్మష మాతృమూర్తిని ఎలా మోసం చేయడం? ఆమె అభిమానం చూస్తుంటే అందుకు తాను తగడు అనిపిస్తోంది. అదంతా రఘుకి చెందవలసింది. కాని ఆ ఆపేక్షను తాను దొంగిలిస్తున్నాడు. ఎన్నాళ్ళు ఈ నిజాన్ని కప్పిపెట్టడం? ఈ మానసిక సంఘర్షణలో సతమతమయిపోతున్నాడు రాజా. అందుకుతోడు సుబ్బమ్మగారికి రాజాని చూడాలనే కాంక్ష మితిమీరసాగింది. ఆవిడకి చివరికి రాజామీద కోపంకూడా రాసాగింది. "నేను బ్రతికి


# పాదాలలో ఆనెలు

పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వ్రేళ్ళు పాతుకుపోయి పాదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రుళ్లిపడు వారు పై పూతగా వాడిన వ్రేళ్లతోసహా మాయంచేయగల సంజీవి. వెల పోస్టుఖర్చులతో రు. 4-25న.పై.

కొక్కోకము చిత్రపటములు గలది. రు. 1-50
దాంపత్య రహస్యములు ... రు. 3-00
తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4-50

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ప్రభ అండ్ కో.
3, మలయపెరుమాళ్ వీధి, మద్రాసు-1.



# మంచి పుస్తకాలు

జీవిత రహస్యాలు:- మీ దాంపత్యసుఖానికి అనేక కామ సూత్రాలు:- ...... రూ 3-50
యువతి:- స్త్రీలను గురించి అనేక కుతూహల విషయాలు ...... రూ 3-50
సంతానము:- గర్భనిరోధానికి 60 నవీన సులభ మార్గాలు ...... రూ 3-50
అమ్మక రహస్యాలు:- వ్యాపారంలో లక్షలు సంపాదించే అనేక కొత్తదారులు రూ 6-00
ఉద్యోగదర్శిని:- మనదేశంలోని అన్నిరకాల ఉద్యోగాలు, అర్హతలు, పొందే మార్గాలు రూ 5-00
ఆత్మజ్ఞానము:- శరీరానంతరం ఆత్మను గురించిన నవీన శాస్త్ర పరిశోధనలు. రూ 2-50
పోస్టు ఖర్చులుచితం. క్రింది ఎడ్రస్సుకు వ్రాస్తే వి.పి పోస్టుద్వారా మీయింటికి పంపబడును.

దేశసేవ ప్రచురణలు, ఏలూరు, ఆంధ్ర



# మంచి రహస్యం

గ్లోరియా ద్రవాన్ని మీ ముఖానికి రుద్ది తుడిచినంతలో అద్భుతమైన కాంతిని, మంచి అందాన్ని వెంటనే తెచ్చును, ముఖంలో ముదిరూపును పోగొట్టి చక్కని లేతదనాన్ని తెచ్చును ఎండకువచ్చే నలుపును, మొటిమలను నమ్మకంగా పోగొట్టును వెల రూ 1-75. అన్ని షాపుల్లో దొరుకును.

JANITA PRODUCTS, ELURU. A.P.



దీపావళి అభినందనలతో



...మ వాడు కాబోలు. ఇంక వాడు వచ్చినా
ముఖంకూడా చూపెట్టను" అంది
...ంతో. వ్యవహారం శృతిమించుతోందని
...జా "ఎందుకమ్మా...... రేపు ఆదివారం
...యుంగావెళ్ళి తీసుకువస్తాగా. నీవేమీ దిగులు
రాజా చాలామంచివాడమ్మా. అతను రాకపోవ
...దో బలీయమైన కారణం ఉండి ఉంటుంది"
...ం.

...దివారం రానేవచ్చింది. ఆ రోజు ప్రొద్దున్నే తీసుకువస్తానని వెళ్ళాడు. మరొక గంటలో అనుకూలంగా మార్చుకుని తిరిగి ఇంటికి ... "అమ్మా" అంటూ. "మళ్ళీ వచ్చావేం ..." అంటూ సుబ్బమ్మగారు సావిట్లోకి ...ది.

...నమ్మా.... రాజాని.... నిన్ను చూడాలని ...మ్మా...." అన్నాడు దగ్గరికి వస్తూ.

...రాజా.... నా రాజా.... నువ్వా నాయనా...... ...మ్మా ఎంత పనయింది! ఇంతకుముందే రఘూ నీకోసం ఊరెళ్ళాడు నాయనా" అంది ఆపేక్షగా అతని బుగ్గలు నిమురుతూ.

"అయ్యో.... అలాగా.... సాయంత్రంలోగా తిరిగివస్తాడేమోలే.... అదేమిటమ్మా.... అంత చిక్కిపోయావు" అన్నాడు రాజా.

"అవునులే.... నీకు ఇప్పటికైనా జ్ఞాపకాని కొచ్చాను" అంది నిష్ఠూరంగా

"లేదమ్మా.... ఎప్పటికప్పుడు వద్దామన్నా ఏదో అడ్డువచ్చేది. ఇప్పుడు నీవు పిలిస్తేనే వచ్చానా అమ్మా?" అన్నాడు ఆవేదన పడుతూ.

ఆరోజు సాయంత్రంవరకూ ఎంతో సంతోషంతో గడిచిపోయింది. సుబ్బమ్మగారు రాజాకి రఘునుగూర్చి కబుర్లు ఎన్నోచెప్పింది. రాజా సుబ్బమ్మగారికి ఒక మంచి చీర కొనిఇచ్చాడు. ఆ సాయంత్రం రాజా మర్నాడు మళ్ళీ డ్యూటీఉందని వెళ్ళిపోయాడు.

రాజా ఆ సాయంత్రం మొదటిఆట సినిమా చూసి తిరిగి రాత్రి ఇంటికి రఘూగా వచ్చాడు. రాజా వచ్చివెళ్ళిన సంగతి సుబ్బమ్మగారు చెప్పింది. అతను రాజాను కలుసుకోలేకపోయినందుకు విచారం నటించాడు.

## 10

రాజాలో మానసిక సంఘర్షణ రోజురోజుకీ అధికమవుతోంది. అది భరించలేక హృదయం పగిలిపోతుందా అని భయపడేవాడు. ఎన్నోమార్లు నిజం బయటపెట్టాలని ప్రయత్నించాడు. కాని పర్యవసానం ఆలోచించుకుని ఆ ప్రయత్నాన్ని విరమించేవాడు. అతనిలో అంతః సంఘర్షణమాత్రం నానా బీభత్సం చేస్తోంది.

సుబ్బమ్మగారికి ఆరోగ్యం బాగా క్షీణించిపోయింది. చివరికి మంచంమీదే ఉండవలసిన స్థితికివచ్చింది. అహర్నిశలూ రాజా ఆమెకు సేవచేస్తూనే ఉన్నాడు. అంత జ్వరంలోనూ ఆమె రాజాకూడా రావాలని పలవరిస్తోంది. ఆ పలవరింతలు రాజా హృదయంపై సుత్తిదెబ్బలు వేసేవి.

ఆ రాత్రి సుబ్బమ్మగారికి దగ్గూ, ఆయాసం మరీ ఎక్కువయాయి. రాత్రి గడవడం కష్టమని డాక్టరు చెప్పాడు. రాజాలో అణగిఉన్న తుఫాను భీకరాకారం దాల్చింది. ఆమె "రఘూ.... రాజాని రమ్మని వ్రాశావా.... నేనింక ఎలాగో ఉండనురా.... మీ ఇద్దరినీ కలిసి కళ్ళారా ఒక్కసారి చూసి కళ్ళుమూస్తానురా...." అంది బాధతో మూలుగుతూ.

రాజా హృదయంలో పిడుగుపడింది. ఆనకట్ట ఒక్కసారి బ్రద్దలయింది. వెక్కివెక్కి ఏడ్చాడు. "అమ్మా! నన్ను క్షమించమ్మా.... నిన్ను మోసం చేశాను... నేను నీ రఘూని కాదమ్మా....రాజాని" అంటూ ఆమె హృదయంపై తల ఆన్చి వలవలా ఏడ్చాడు.

సుబ్బమ్మగారికి హృదయం బ్రద్దలయింది. అతను ఏమంటున్నదీ ఆమెకు అర్థంకాలేదు. "ఏమిటి నాయనా నీ వంటున్నది" అనడిగింది హీనస్వరంతో.

రాజా "అవునమ్మా.... నీ రఘూ సైన్యంనుంచి తిరిగివస్తూ మలేరియావచ్చి మరణించాడు. ఆ వార్త రఘూ వస్తానన్న తేదీకి ముందుగా టెలిగ్రాంద్వారా వచ్చింది. కొడుకుకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తున్న నీవు ఆ వార్తను భరించలేవని ఈ నాటకం ఆడానమ్మా.... ఇందులో నా స్వార్థం ఏమీ లేదమ్మా.." అంటూ జరిగినదంతా చెప్పాడు. నిజం బయటపెట్టగానే అతని మనస్సు, మెడమీదనుంచి మేరు పర్వతాన్ని దించినంత తేలికపడింది.

సుబ్బమ్మగారు బరువుగా ఒక్కనిట్టూర్పు విడిచింది. బాధతో ఒక్కసారి గట్టిగా కళ్ళుమూసుకుంది.

రాజా "అమ్మా నేను చేసిన మోసానికి నన్ను క్షమిస్తావా? నా ఈ పాపానికి నాకు నిష్కృతి ఉందా అమ్మా." అని వాపోయాడు.

సుబ్బమ్మగారు "రఘూ" అని పిలిచింది.

రాజా "కాదమ్మా.... నేను రాజాని, "అన్నాడు.

ఆమె "కాదు.... నీవు నా రఘూవే....నా కన్న బిడ్డవే....కంటేనే బిడ్డలా? నా కన్న బిడ్డ నాకు ఏమి చేశాడు. దగ్గర ఉన్నంతకాలం నన్ను ఏడిపించాడు. చివరికి బుద్ధిమారింది అనుకున్నాము. ఆ అదృష్టం నాకు లేదుకాబోలు....భగవంతుడు వాడిని తీసుకుపోయాడు. వాడు వచ్చినామాత్రం నన్ను సుఖపెట్టేవాడని నమ్మకం ఏమిటి? పుట్టుకతో వచ్చిన బుద్ధి ఎలాగుండేదో....నీవు ఒక మాతృమూర్తి దుఃఖం చూడలేక నీ జీవితాన్నే నాకోసం త్యాగంచేశావు. అందుకు ఫలితంగా అనునిత్యమూ హృదయంలో రంపపుకోతకు గురయ్యావు. ఎందరు కన్నబిడ్డలు ఇంతటి త్యాగం చేయగలరు నాయనా? నీవే నా బిడ్డవు....రాజే నా బిడ్డ.... అంటూ ఆనంద విషాదాలు పట్టలేక, రాజాని కౌగలించుకుని బావురుమని ఏడ్చింది.

ప్రక్కనేఉన్న దీపం నిశ్చలంగా వెలుగుతోంది. సుబ్బమ్మగారి ముఖంలో ప్రశాంతత తాండవిస్తోంది. ఆనందబాష్పాలు ఆమె కనుకొలకుల నుండి జారుతున్నాయి. వెలుగులో అవి ముత్యాల లాగా మెరుస్తున్నాయి.

"రఘూ.... కాదు కాదు.... నా రాజా.... ఇలా దగ్గరికి రా నాయనా...." అంది ఆమె ఆయాస పడుతూ.

రాజా దగ్గరకు వచ్చాడు. ఆప్యాయంగా ఆమె అతని చేయి ఎడమచేత్తో పుచ్చుకుని కుడిచేత్తో తల నిమురుతోంది.

రాజా "బాధగా ఉందాఅమ్మా" అన్నాడు.

ఆమె "ఎందుకు నాయనా...నీలాంటి కొడుకు చేతిమీదగా వెళ్ళిపోవడంకంటె నాకు కలిగే ఆనందం అదృష్టం ఇంకేమి ఉంటాయి." అంటూండగానే దగ్గుతెర వచ్చి ఆమె మెలికచుట్టుకు పోయింది.

దీపం ఒక్కవెలుగు వెలిగి ఆరింది. "రాజా" అంటూ కన్నుమూసింది ఆ మాతృమూర్తి. ఆమె ముఖంలోమాత్రం ఎనలేని ప్రశాంతత గోచరిస్తోంది. "అమ్మా" అని కూలిపోయాడు రాజా.

మర్నాటి ఉదయం ఆ పవిత్రమాతృమూర్తిని కృష్ణాతీరంలో అగ్నిదేవునికి కానుకగా సమర్పించి, ఆమె చితా భస్మాన్ని పావన కృష్ణాతరంగాలలో కలిపి వచ్చాడు రాజా. సూర్యకిరణాలు దుర్గాలయ శిఖరంపై పడి మెరుస్తుంటే, కృష్ణమ్మ, సుబ్బమ్మ సాహచర్యంతో తన పవిత్రత హెచ్చినట్లు, వడి హెచ్చించి పరుగులిడసాగింది. ★

---

"రాక్ ఏంజిల్" (మొనాకో మట్టానికి 1000 అడుగుల ఎత్తు)కు వెళ్తారు.

నిజంగా ఆ కొండ అంచున క్రిందకు సముద్రం లోనికి చూస్తూఉంటే ఆ చిన్ని "విల్లా" మీదను అనంతాకాశం దిగువను రమణీయమైన ప్రకృతి అంతా అదో స్వర్గంలా ఉంటుంది. ప్రేయసీ ప్రేమికులకు అనువైన స్థలమే అది! రాజా, రాణి మొదట్లో అక్కడకు తరచుగా వెళ్ళేవారు.

సాధారణంగా రాణికి ఈ పర్వత గృహమే ఇష్టం. అక్కడ చాలా పనులు మామూలు గృహిణికి మల్లే ఆమె తానే చేస్తూంటుంది, పిల్లలకి నీళ్ళుపోయడం బట్టలు ఉతకడం, వంట వండటం కూడా ఒక్కో

# నేనూ మా రాజుగారూ

24-వ పేజీ తరువాయి

సారి ఆమె చేస్తుంది. వంటవాళ్లకు శలవులైతే ఆమె ఈ పనులు చేస్తుంది.

రాణీ ఈ పనులు చేస్తుందా? యిక అదే వేళల్లో రాజాగారు రైతు వేషం వేస్తాడు. ఒక ట్రాక్టర్‌తో "రాక్ ఏంజిల్" ను దున్నుతాడు. నారింజ మొక్కలూ అవీ నాటుతూ గడుపుతాడు.

గ్రేస్ సినిమాలు చూస్తుంది. కోటలోనే కాటేజీలో ఒక భాగం నుంచి సినిమాహాలుగా చక్కగా నిర్మించారు. శీతాకాలంలో అందులో సినిమాలు వేస్తారు.

రాజా రైనీర్‌కు అమెరికన్ ఫిల్ములు యిష్టమేనని చెబుతుంది రాణీ.

ఆమె తన సినిమాలలో ఒక్క 'టు కాచ్ ఎ థీఫ్' అన్న సినిమాను మాత్రం ఈ సొంత థియేటర్‌లో రెండోమాటు వేయించుకొంది.

ఆమెకు స్వయంగా పిల్లలిద్దరూ వేసిన 16 మి. మి. ల రంగు సినిమాలంటే ఇష్టం. వాస్తవానికి ఆమెకు తనభర్తా, పిల్లలూ—ఇవే స్వర్గం—

(అయిపోయింది)

(కాపీరైటు : గ్రాహం అండ్ హీదర్ ఫిషర్‌లు.